
శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- నెమిల గ్రామంలో ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్
- ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్న ప్రజలు
- ట్యాంక్‌ను తొలగించాలని వేడుకోలు

రాజాపేట : మండలంలోని నెమిల గ్రామంలో గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గ్రామంలో మంచి నీటి ఇబ్బందులు తొలగించేందుకు 1996 సంవత్సరంలో 6వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. ఈ ట్యాంకు పిల్లర్లు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలి కూలడానికి సిద్ధంగా ఉండడంతో ట్యాంకును ప్రస్తుతం వినియోగించడం లేదు. ట్యాంకుకు సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక హెల్త్ సబ్‌సెంటర్‌తో పాటు నివాస గృహాలు ఉన్నాయి. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సైతం ఈ ట్యాంకు సమీపం నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అయితే శిథిలావస్థకు చేరిన ట్యాంకు ట్యాంకు ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో కంటికి నిద్ర లేకుండా బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నామని ట్యాంక్ చుట్టు పక్కల గృహాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

పట్టించుకోని అధికారులు

ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ట్యాంకు తొలగించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరి ట్యాంకును తొలగించి నూతన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.




ఇనుప చువ్వలు తేలిన పిల్లర్లు

ట్యాంకు తొలగించాలి



శిథిలావస్థకు చేరిన ట్యాంకు పక్కనే అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక హెల్త్ సబ్‌సెంటర్, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నిత్యం ట్యాంకు పక్కనుంచే విద్యార్థులు వస్తూ.. పోతుంటారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందో తెలియక భయపడుతూ ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రమాదకంరగా ఉన్న ట్యాంకును తొలగించాలని కోరుతున్నాం.

– పద్మ, అంగన్‌వాడీ టీచర్, నెమిల

భయాందోళనకు గురవుతున్నాం



శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు నివాస గృహాలకు సమీపంలో ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియక కాలనీవాసులందరూ భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకును తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకును తొలగించాలని కోరుతున్నాం.

– దొంతెన లోకేష్, నెమిల గ్రామస్తుడు

ట్యాంక్‌ను తొలగిస్తాం

గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రమాదకరంగా ఉందని ఇటీవల తెలిసింది. ప్రస్తుతం ఆ ట్యాంకును వినియోగించడం లేదు. గ్రామ పంచాయతీ తీర్మాణం చేసి ఆర్‌డబ్ల్యూఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే అధికారుల ఆదేశాలమేరకు ట్యాంక్‌ను తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

–వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

క్లుప్తంగా

యాదాద్రీశుడి సేవలో కాంగ్రెస్ నేతలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య బుధవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖమండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి


చెక్కు అందజేస్తున్న పాలకూర్ల మురళి

చౌటుప్పల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని పాలకూర్ల శివయ్యగౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి అన్నారు. పట్టణ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో పదవ తరగతి వరకు చదివిన నార్కట్‌పల్లికి చెందిన నిరుపేద విద్యార్థిని వై.అక్షయ ఉన్నత చదువుల కోసం బుధవారం తన ఫౌండేషన్ తరఫున లక్ష రూపాయల చెక్కును విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి భవానీ, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

'పీజీ స్టార్'కు కార్తీకేయ పరిశోధన ప్రాజెక్టు ఎంపిక

భువనగిరి : భువనగిరి పట్టణానికి చెందిన పోలా శ్రీనివాస్ గుప్తా కుమారుడు డాక్టర్ పోలా కార్తీకేయ హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ కళాశాలలో ద్రవ్యగుణ విభాగంలో పీజీ చేస్తున్నాడు. ఆయుర్వేద చికిత్సల ద్వారా శస్త్ర చికిత్స లేకుండా నడుము నొప్పి నివారణపై ఆయన చేసిన పరిశోధన ప్రాజెక్టు పీజీ స్టార్(స్కీం ఫర్ ట్రెనింగ్ ఇన్ అయుర్వేద రీసెర్చ్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయోట్ స్కాలర్)కు ఎంపికై ంది. డాక్టర్ ఎస్.బాబురావు మార్గదర్శకత్వంలో డాక్టర్ విజయలక్ష్మీ, రమాదేవి పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసినట్లు ఆయన తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల వ్యవసాయ శాఖ అధికారిగా బి. అరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మోటకొండూరు మండల ఏఓ సుజాత ఇన్‌చార్జ్‌గా ఏఓగా ఇక్కడ విధులు నిర్వహించారు. మండలానికి పూర్తి స్థాయి ఏఓగా నియామకం చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రిజినల్ కో ఆర్డినేటర్ ఆదిత్య వర్మ, వక్తలు రంజిత్, శ్రీరామ్, సుధాకర్, వరుణ్, పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

యాదగిరిగుట్ట రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ఎంపీడీఓ నవీన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇప్పటివరకు గ్రామంలో పీహెచ్‌సీలో నమోదైన పీవర్ కేసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆరోగ్య ఉప కేంద్రం వైద్యులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని హైవే వెంట గల కాలనీలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుకు వినతిపత్రం అందజేశారు. మురికి కాలువ లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపునీరు ఇళ్లలోకి చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండమీది మల్లేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా శ్రీశైలం

భువనగిరి : పట్టణ కేంద్రంలో బుధవారం భువనగిరి గణేష్ ఉత్సవ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రత్నపురం శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు పట్నం కపిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి గౌరవ సలహాదారు సుర్వి శ్రీనివాస్, పూస శ్రీనివాస్,కాలేరు లక్ష్మణ్,మెరుగు మధు,ఆకుల మహేందర్, రమేష్, బాలశంకర్, నల్లమాస వెంకటేశ్వర్లు,పోకల రవీందర్, కృష్ణచారి, సాయికిరణ్,మల్లేష్, భాను, సుర్వి మణికంఠ, నితీష్, రాజు, సురేష్, భరత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : పట్టణకేంద్రంలో నేతాజీ యువజన సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గణేష్ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శెట్టి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడిని నేతాజీ యువజన సంఘం సభ్యులు సన్మానించారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి

గుండాల : గోదావరి జలాలతో మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ అసంపూర్తిగా మిగిలిపోయిన కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. భూసేకరణ చేసిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని, తూములకు మరమ్మతులు చేపట్టి షట్టర్లు బిగించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాటూరు బాలరాజు, కొల్లూరు రాజయ్య, కుసుమని హరిశ్చంద్ర, అనంతుల రామచంద్రు, మద్దెపురం రాజు, పోతరబోయిన సత్యనారాయణ, పైళ్ల యాదిరెడ్డి, కొప్పుల కొమురయ్య, పోతరబోయిన అంజయ్య, కొర్న యేసోబు, బాలయ్య, స్వామి, బక్కయ్య, భిక్షపతి, వెంకటయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


గుండాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

జలశక్తి అభియాన్ బృందం పర్యటన

భువనగిరి రూరల్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో బుధవారం జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ ఆఫీసర్, కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ సౌరబ్ సింగ్, టెక్నికల్ ఆఫీసర్, కేంద్ర భూగర్భ జల శాఖ సైంటిస్ట్ ఉపేంద్ర ధోండే బృందం పర్యటించింది. పంచాయతీలో జలశక్తి అభియాన్ స్కీమ్‌కు సంబంధించిన పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పల్లెప్రకతి వనాలు, గుట్టపై చేసిన ఖండిత కందకాల పనులను తనిఖీ చేశారు. పండ్ల తొటల పెంపకం కింద మంజూరు చేసిన మామిడి తోటను సందర్శించారు. పల్లె ప్రకతి వనం వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ టి.నాగిరెడ్డి, జి. సురేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ దినాకర్, లింగస్వామి, తదితరులు ఉన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

చిన్నారులకు టీకాలు తప్పనిసరి


వేములకొండలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారావు

వలిగొండ: చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణారావు వైద్యులను ఆదేశించారు. వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు దుప్పెల్లి, ఆరూర్ ఉప కేంద్రాలను బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్లు, జ్వర కేసుల నమోదు రికార్డులు, పి ల్లలకు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ప్రసిద్ధ్, సూపర్‌వైజర్లు ప్రవీణ్, అనురాధ, మరియమ్మ, ఏఎన్‌ఎంలు వినోద, సుస్మిత, కృష్ణవేణి, సౌజన్య, రామలీల, కవిత, సూర్యకాంతం, పావని నీరజ, సిబ్బంది ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

భువనగిరిటౌన్ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పోకల యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాటం ఐలేష్, సాధినేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నోడల్ అధికారి, మండల వ్యవసాయాధికారిణి కె.శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి ఒక్కరికీ రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని అన్నారు. అనేక నిబంధనలతో చాలా మంది రైతులకు రుణమాఫీ వర్తించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల మధు, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

యాదగిరిగుట్ట(తుర్కపల్లి): ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనేక షరతులు పెట్టి రుణమాఫీ చేసిందన్నారు. దీంతో చాలా మంది రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, కార్యవర్గ సభ్యులు వల్లంపు భగవంత్, దాసరి బాలయ్య, ఫకీరానాయక్, మల్లయ్య, భూమయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తుర్కపల్లి ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గ్రామస్థాయిలో దరఖాస్తులు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

రామన్నపేట : రుణమాఫీ కానీ రైతుల నుంచి గ్రామస్థాయిలో దరఖాస్తులు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్‌ను వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలంలో తొమ్మిది వేల మంది రైతులకు కేవలం నాలుగు వేల మందికి రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెల్లెల పెంటయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, కల్లూరి నాగేష్, గన్నెబోయిన విజయ భాస్కర్, బల్గూరి అంజయ్య, కందుల హన్మంత్, బావండ్లపల్లి బాలరాజు, ఎండీ రశీద్, గొరిగె సోములు, గోగు లింగస్వామి, కొమ్ము అంజయ్య, కాటమయ్య, లతీఫ్, తాడూరి క్రిష్ణ, మత్స్యగిరి పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో బుధవారం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, మదర్‌థెరిసా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎల్‌టీ ఫౌండేషన్ డైరక్టర్ జార్జ్ మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. మన ఆరోగ్యం కోసం మనమే పంటలు పండించుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు జార్జ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు జూలియన్ పోలిశెట్టి, కం పెనీ చైర్మన్ పల్లె పుష్పా రెడ్డి, జక్కడి మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

భువనగిరి క్రైం: భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో నివాసముంటున్న అస్సాం రాష్ట్రానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రం సోనిత్‌పూర్ జిల్లా బిస్వనాథ్ చిరియాలి మండలం జాపొబరి గ్రామానికి చెందిన లక్కం భూమిజ్, అదే గ్రామానికి మరో నలుగురు కలిసి ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో నివాసముంటూ గ్రామ శివారులో గల రాజశ్రీ ఎంటర్‌ప్రైజెస్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భూమిజ్ ఈ నెల 20వ తేదీ నుంచి కనిపించడంలేదు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో బంధువులకు ఫోన్ చేయగా అస్సాంకు కూడా రాలేదని చెప్పారు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

'వయ్యారిభామ'ను నివారించాలి

భువనగిరి రూరల్ : పంట పొలాల్లో వయ్యారిభామ మొక్కను నివారించాలని ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్ కుమార్, శాస్త్రవేత్త కె.మమత అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో వయ్యారిభామను నివారణపై బుధవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, బొల్లెపల్లి, అనాజిపురం, కూనూర్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓ శ్రీశైలం, పలువురు రైతులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

భూదాన్‌పోచంపల్లి : కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగుడాల శివ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో పీడీఎస్‌యూ, ప్రగతిశీల యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, రాము, బాబు, కరుణాకర్, పోతగల్ల నర్సింహ, లక్ష్మీనారాయణ, దేవేందర్, విద్యార్థులు భావన, త్రిజ, జ్యోతి, శ్రీచందన, అక్షయ, అస్మిత, వైష్ణవి, శివానీ, వర్షిణి పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరణ

అడ్డగూడూరు : మండలంలో రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో రుణమాఫీ కానీ 70 మంది రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దయాకర్, రైతులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి

- ఆర్డీఓ అమరేందర్

భువనగిరి: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు జాగ్రత్తగా చూసుకోవాలని భువనగిరి ఆర్డీఓ పి.అమరేందర్ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా సంక్షేమ శాఖ, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యూనల్ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధులల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది వయోవృద్ధులు తమ పిల్లలకు ఆస్తులను ఇచ్చి చివరికి పోషించడం లేదని తమ ఆస్తులు తమకు ఇప్పించాలని కోరుతూ ట్రిబ్యునల్‌కు రావడం బాధకరంగా ఉందన్నారు. వయోవృద్ధులకు సంబంధించిన చట్టాల లక్ష్యాలను సాధించేందుకు ట్రిబ్యునల్‌తో పాటు సంక్షేమ శాఖ సేవలందిస్తుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడావల్సిన నైతిక బాధ్యత పిల్లలకు ఉంటుందన్నారు. వయోవృద్ధులు కొంత అస్తిని తమ వద్దనే ఉంచుకోవాలని ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి శైలేజ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, భువనగిరి న్యాయ సహాయ కేంద్రం డిప్యూటీ న్యాయ సహాయ న్యాయవాది జి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.


భువనగిరి : మాట్లాడుతున్న ఆర్డీఓ అమరేందర్

సీనియర్ సిటిజన్‌యాక్ట్‌ను ఉపయోగించుకోవాలి

రామన్నపేట : వయోవృద్ధులు తమ హక్కులకు భంగం కలిగినప్పుడు సీనియర్ సిటిజన్‌యాక్ట్‌ను ఉపయోగించుకోవాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.ప్రదీప్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి చందన తెలిపారు. బుధవారం రామన్నపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న వారిని కుమారులు, కూతుళ్లు పోషించకుంటే చట్టపరంగా మేయింటనెన్స్, గృహవసతి, వైద్య ఖర్చులను పొందవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యాపాల క్రిష్ణారెడ్డి, జినుకల ప్రభాకర్, దూశర్ల నరేందర్‌రావు, ఎండీ మజీద్, ఉయ్యాల హన్మంత్, పాల్వంచ జగతయ్య, నకిరేకంటి మొగులయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, సత్తయ్య, డేవిడ్, స్వామి, కోర్టు సూపరింటెండెంట్లు నారగోని గంగాభవానీ, శివరాజు పాల్గొన్నారు.


రామన్నపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రదీప్

జూనియర్ కళాశాల వద్ద బస్సులు ఆపాలి


నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సులు ఆపాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. కాలేజీ వద్ద బస్సులు ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాలేజీ వద్ద బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కళాశాల వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు నిలిపేందుకు చర్య తీసుకో వాలన్నారు. కాలేజీ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఫర్దిన్, నరేందర్, బిందు, నవనీత, రుచిత, వెన్నెల పాల్గొన్నారు.

కాలుష్యకారక పరిశ్రమలపై చర్య తీసుకోవాలని వినతి

బొమ్మలరామారం : కాలుష్యకారక పరిశ్రమలపై చర్య తీసుకోవాలని కోరుతూ మండలంలోని రంగాపూర్ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. చెరువులో కలుషితం కావడంతో చెరువులోని చేపలు మృతి చెందాయని ఆరోపిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రంగాపూర్ గ్రామంలోని చెరువులోకి గ్రామ పరిసరాలలో గల కెమికల్ కంపెనీలు వదిలే విష వ్యర్థ జలాలతో గ్రామ చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,నాయకులు మైలారం జంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శాస్త్రీయ విద్యావిధానం కోసం ఉద్యమించాలి

ఆలేరురూరల్ : శాస్త్రీయ విద్యావిధానం కోసం ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని జరిగిన జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అంగడి కరుణాకర్, ఉపాధ్యక్షులు తుంగ శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శి అంగడి సూర్య, కోశాధికారి నాగెల్లి ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా బి.శివ, ఎస్. శివ, సుదీర్, చంటి కల్పనలను ఎన్నుకున్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ పదవి ఎరుకలకే ఇవ్వాలి

యాదగిరిగుట్ట: ఏకలవ్య కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితికే ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానుపాటి కృష్ణ కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిజిలి కుమార్, అంగిడి యాదగిరి, ప్రధాన కార్యదర్శి దేవారాయ్ స్వామి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగి రాకలో ఆంతర్యమేమిటి?

యాదగిరిగుట్ట: బదిలీపై వెళ్లిన ఆలయ ఉద్యోగిని తిరిగి అదే స్థానంలోకి తీసుకురావడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ కురుమ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ ఉద్యోగుల బదిలీలు జరిగిన 15 రోజుల్లోనే ప్రత్యేక జీఓ ద్వారా యాదాద్రి ఆలయం నుంచి వేములవాడ దేవాలయానికి బదిలీ అయిన సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగిని సిబ్బంది కొరత, పనిభారం, అత్యవసర పరిస్థితుల పేరుతో తిరిగి తీసుకువచ్చారన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, నెమ్మోజు నరేష్ , బూడిద నవీన్, నరేష్, లక్ష్మయ్య , కర్రే శ్యామ్, సూదగని శివ, కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.

గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి సన్మానం

మోత్కూరు : తుంగతుర్తిలో బుధవారం జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని బీజేపీ మోత్కూరు మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పోచం సోమయ్య కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.


ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న తడక రమేశ్

సాక్షి ఎఫెక్ట్..

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బసవలింగేశ్వర కాలనీకి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి నర్సింహస్వామి క్లోమగ్రంధి వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన దీనస్థితిపై ఈ నెల 17న 'నిరుపేద కార్మికుడిని ఆదుకోరూ'అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పలువురు స్పందించారు. బుధవారం కర్నాటి నర్సింహస్వామి పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ పరామర్శించారు. టీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట టై అండ్డై అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కుడికాల రాంనర్సింహ, హ్యాండ్లూమ్ మార్కెట్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు, చేనేత నాయకులు గుండు ఉప్పలయ్య, అంకం పాండు, బోగ నర్సింహ, వలందాస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు


రైతులతో రద్దీగా ఉన్న ఏపీజీవీ బ్యాంక్

ఆత్మకూరు(ఎం): ప్రభు త్వం వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తుందని తేదీలు ప్రకటించిన నాటినుంచి రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రుణమాఫీ విషయంలో గందరగోళ పరిస్థితులు ఉండగా తమ రుణా లు మాఫీ అయ్యాయా.. లేదా అంటూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రు ణమాఫీ అయిన వారు కొత్త రుణాల కోసం, రుణమాఫీ కానివారు ఎందుకు మాఫీ కాలేదని తెలుసుకునేందుకు రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కాగా మండలంలోని బ్యాంకుల వద్ద బుధవారం రుణమాఫీ అయిందో లేదో తెలుసుకునేందుకు రైతులు బారులుదీరారు. రుణమాఫీ కానీ రైతులు మండలానికి నియామకమైన నోడల్ అధికారి అరుణకు దరఖాస్తులు అందజేశారు.